నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 3 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

బురదలో కూరుకుపోయిన టాటా మ్యాజిక్

## బురదలో దిగబడే.. బడిపిల్లలు భయపడే

● తుర్కపల్లిలో రోడ్డు అధ్వానం ● కూరుకుపోయిన స్కూల్ వాహనం
● బయటకు నెట్టిన స్థానికులు

చెన్నూర్ రూరల్, ఆగస్టు 2 : తుర్కపల్లి లోని రోడ్డు అధ్వానంగా మారగా, ప్రయాణం నరకప్రాయంగా మారింది. శుక్రవారం సాయంత్రం చెన్నూర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు టాటా మ్యాజిక్‌లో తుర్కపల్లికి బయలుదేరగా, ఊరిలోకి రాగానే వెనుక టైర్లు మొత్తం బురదలో దిగబడ్డాయి. రోడ్డు పక్కనే పెద్ద గుంత ఉండడంతో అందులో పడిపోతామేమోనని విద్యార్థులు భయపడిపోయారు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన వచ్చి బురదలో దిగబడ్డ వాహనాన్ని బయటకు నెట్టారు. దీంతో విద్యార్థు లు సురక్షితంగా బయటపడ్డారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ చొరవ తీసుకొని తుర్కపల్లికి రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జూలై 31న నమస్తే తెలంగాణలో ప్రచురించిన కథనం

## మడత మంచాల ఎత్తివేత

### మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో రోగులకు ప్రత్యేక వార్డులు

మడత మంచాలు ఎత్తివేయడంతో ఖాళీగా వరండా

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 2 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వరండాలో మడత మంచాలు వేసి వైద్యం అందిస్తున్న తీరుపై జూలై 31న 'నమస్తే తెలంగాణ'లో 'మడత మంచాలపై వైద్యం' శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనిపై వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. దవాఖాన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే మడత మంచాలు ఎత్తి వేయాలని, రోగులకు బెడ్లు ఏర్పాటు చేసి మెరుగైన వైద్య మందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మడత మంచాలను ఎత్తివేసి ఎస్ఐసీయూ, కేర్ సెంటర్‌లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు రోగులకు చికిత్స అందిస్తున్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన 'నమస్తే తెలంగాణ'కు పలువురు రోగులు కృతజ్ఞతలు తెలిపారు.

# పూర్తయిన పనులకు టెండర్లు!

### మంచిర్యాల మున్సిపాలిటీలో ఇంజినీర్ల బాగోతం

● మిగిలిన డబ్బులతో పనులు చేసి.. మరోసారి టెండర్లు పిలవడమేమిటో..? ● బిల్లులు కాజేయడానికేనంటున్న కాంట్రాక్టర్లు ● చేసేదంతా చేస్తూనే తమ దృష్టికి రాలేదంటున్న అధికారులు

స్లాటర్ హౌస్ నుంచి అయ్యప్ప టెంపుల్ దగ్గరున్న డ్రైనేజీ వరకు కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

23 వార్డులో పూర్తయిన ర్యాంప్ నిర్మాణం

మంచిర్యాల, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల మున్సిపాలిటీలోని ఇంజినీర్ల వ్యవహారశైలి విమర్శలకు తావిస్తున్నది. బల్దియా జనరల్ ఫండ్ నుంచి రూ. 2 కోట్ల అంచనాతో 45 పనులకు టెండర్ల వ్యవహారంలో మరో నిర్లక్ష్యం వెలుగుచూసింది. గత నెల ఈ పనులకు సంబంధించిన టెండర్లను మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, వైస్ చైర్మన్ మహేశ్ ఆధ్వర్యంలో కొందరు కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లు కలిసి లాటరీ పద్ధతిలో పంచుకున్నారు. దీనిపై పత్రికల్లో కథనాలు రాగా, స్పందించిన మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ ఆ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావద్దని కిందిస్థాయి అధికారులను హెచ్చరించారు. ఇంత జరిగినా మంచిర్యాల మున్సిపాలిటీ ఇంజినీర్ల తీరు మారలేదు. ప్రతి వార్డుకు రూ. 4 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు జనరల్ ఫండ్ నుంచి చేయాల్సిన పనులకు శుక్రవారం టెండర్లు పిలిచారు. గత నెలలో రద్దు చేసిన పనులకు మరోసారి టెండర్లు పిలుస్తుండడంతో ఈ సారైనా నిబంధనల ప్రకారం చేస్తారని అంతా భావించారు. కానీ మంచిర్యాల 23వ వార్డులో ఇప్పటికే పూర్తయిన పనులకు టెండర్లు పిలవడం గమనార్హం. స్లాటర్ హౌస్ నుంచి అయ్యప్ప టెంపుల్ దగ్గరున్న డ్రైనేజీ వరకు సీసీ రోడ్డుతో పాటు మరో రెండు పనులకు రూ.4,04,108కు, అలాగే బైపాస్ రోడ్ నుంచి స్లాటర్ హౌస్‌కు వెళ్లేందుకు ర్యాంప్ నిర్మాణానికి రూ.1,61,172కు టెండర్లు పిలిచారు. కాగా, ఈ రెండు పనులు పూర్తయిపోయాయి. రోడ్డు నిర్మాణం ఈ రోజే (శుక్రవారం) హడావుడిగా పూర్తి చేశారు. ర్యాంప్ నిర్మాణం కూడా ఈ మధ్యే చేసేశారు. మరి టెండర్లు పూర్తి కాకముందే పనులు ఎలా చేశారు. పనులు పూర్తయ్యాక టెండర్ ఎలా చేశారు.. ఎవరి మొప్పు కోసం ఇలా చేశారనేది అంతుబట్టడం లేదు.

### మిగిలిన నిధులతో చేస్తే మళ్లీ టెండర్ ఎందుకో..?

పూర్తయిన పనులకు టెండర్లు ఎలా పిలుస్తారని మున్సిపల్ ఇంజినీర్ మసూద్‌ను వివరణ కోరగా, అంతకుముందు చేసిన పనుల్లో మిగిలిన నిధులతో ఆ పనులు చేసి ఉండొచ్చన్నారు. సాధారణంగా ఏదైన ఒక వార్డులో పనులు పూర్తి చేశాక, ఫండ్స్ మిగిలిపోతే ఆ డబ్బుతో వేరే పనులు చేయవచ్చు. గతంలోనూ ఈ తరహాలు పనులు చేశారు. కానీ, అలా మిగిలిన ఫండ్స్‌తో పూర్తయిన పనులకు తిరిగి టెండర్ పిలవడం అనేది గతంలో ఎప్పుడూ జరగలేదు. ఇది నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. మిగిలిన డబ్బులతో చేసిన పనులకు మళ్లీ టెండర్ అంటే బిల్లులు కొట్టేయడమే తప్ప మరొకటి కాదని కొందరు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని మున్సిపల్ ఇంజినీర్ దగ్గర ప్రస్తావించగా పనులు జరిగిన విషయం తమ దృష్టికి రాలేదంటూ ముందు ఒకలా, తర్వాత మరోలా సమాధానం ఇవ్వడం అనుమానాలకు తావిస్తున్నది. అధికారులకు అంతా తెలిసే ఇదంతా చేస్తున్నారంటూ కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకుల కనుసన్నల్లోనే ఈ వ్యవహారం నడుస్తుందంటూ మండిపడుతున్నారు. దీనిపై 23వ వార్డు కౌన్సిలర్ బానేష్‌ను వివరణ కోరగా.. చనిపోయిన వారి దహన సంస్కారాలకు ఆ రోడ్డులో వెళ్లేందుకు జనాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరితగతిన పనులు పూర్తి కావాలనే ఉద్దేశంతోనే రోడ్డు వేయించాం తప్ప వేరేది లేదన్నారు. మరి ఈ వ్యవహారంపై మున్సిపల్ అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి. మిగిలిన ఫండ్స్‌తో పనులు చేశారు కాబట్టి ఈ టెండర్లను రద్దు చేస్తారా.. లేక పూర్తయిన పనులకు మరోసారి బిల్లులు మంజూరు చేసి చేతులు దులుపుకుంటారా అన్నది తేలాల్సి ఉంది.

## సర్వేయర్ల బదిలీ

హాజీపూర్, ఆగస్టు 2 : జిల్లాలోని సర్వేయర్లను బదిలీ చేస్తు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను కామారెడ్డి జిల్లా సర్వేయర్, ల్యాండ్ రికార్డ్సుకు బదిలీ చేశారు. ఇక్కడ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న గంగాధర్‌ను జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్‌డీసీ ఎల్ఆర్‌అండ్‌ఆర్‌లో విధులు నిర్వహిస్తున్న నూర్ సింగ్‌ను కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి, సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం ప్రసాద్‌ను కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు, సర్వేయర్ నరసింహారాజును కుమ్రం భీం ఆసిఫాబాద్‌కు, సర్వేయర్ జీ కృష్ణ ప్రియను పెద్దపల్లి జిల్లాకు, సర్వేయర్ మణిరాజును కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు, లక్షెట్టిపేట, జన్నారం తహసీల్దార్ కార్యాలయాల్లో సర్వేయరుగా విధులు నిర్వహిస్తున్న సురేశ్‌కృష్ణను పెద్దపెల్లి జిల్లాకు, డిప్యూటీ సర్వేయర్ కృష్ణను కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు, డిప్యూటీ సర్వేయర్ రాజశేఖర్ చారిని పెద్దపెల్లి జిల్లాకు, గ్రేడ్-2 సర్వేయర్ బీ శ్రీనివాస్‌ను పెద్దపెల్లి జిల్లాకు బదిలీ చేశారు. బదిలీ అయిన సర్వేయర్లు తక్షణమే విధుల్లో చేరాలని కమిషనర్ ఆఫ్ సర్వే, సెటిల్‌మెంట్స్, ల్యాండ్ రికార్డ్సు అధికారి జ్యోతిబుద్ధ ప్రకాశ్ తెలిపారు.

మందమర్రి : అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దండేపల్లి : మందకృష్ణ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సిర్పూర్ (యు) : మందకృష్ణ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

# 'ఎస్సీ వర్గీకరణ'పై ఆనందహేల

### మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఎమ్మార్పీఎస్ సంబురాలు

పెంచికల్ పేట్ : కొండపల్లిలో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్‌లో అంబేద్కర్, మందకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నమస్తే బృందం, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల వ్యాప్తంగా శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. దండేపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి, అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. లక్షెట్టిపేటలోని ఊత్కూర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నాయకులు కాంతారావు, దర్శన్న, స్వామి, రాజలింగు, విక్రమ్, సోను, రవి, డిన్ను, సతీశ్ ఉన్నారు. శ్రీరాంపూర్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంథెన మల్లేశం ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మల్లేశం, నాయకులు గద్దెల బానయ్య, డాక్టర్ శరత్‌కుమార్, చుంచు శంకర్‌వర్మ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ తీశారు. శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. నాయకులు స్వామి, పెర్క సత్యనారాయణ, జూపాక సాయిలు, వేల్పుల రవీందర్, శ్రీరాములు, భూమయ్య, బోనాసి స్వామి, లక్ష్మణ్, రేగుంట లింగయ్య, కుమార్ ఉన్నారు. మందమర్రిలోని సింగరేణి పాఠశాల వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఆది జాంబవ సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. సంఘం పట్టణ అధ్యక్షుడు వాసాల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బీదునూరి శంకర్, గౌరవ అధ్యక్షుడు కంబాల రాజనర్సు, ప్రధాన కార్యదర్శి అవునూరి పోశం, ప్రచార కార్యదర్శి దాసరి రాజనర్సు, నాయకులు గసికంటి పోశం, కసిపాక తిరుపతి, నాయిని శంకర్, కరుణాకర్, ఏల్పుల రవి, రాజ్ కుమార్, రత్నం మొగిలి, అట్కపురం కుమారస్వామి, రాజేశం, నెరువట్ల రాజలింగు, ఉప్పులేటి నరేశ్, కర్రావుల రాజేశ్, తుంగపిండి ఉపేందర్, కుంబులు, దుర్గయ్య, సంగి రవి ఉన్నారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని కోదండ రామాలయం ఏరియాలో గల తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు. బైక్ ర్యాలీ తీశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహంతో పాటు మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, రెల్లి సంఘం నాయకులు చెన్నూరి సమ్మయ్య, డాక్టర్ శరత్‌బాబు, జీడీ సారంగం, శివ, రాచర్ల సరేశ్, పోచయ్య, రాజేందర్, వెంకటేశ్, ఈశ్వర్, ఓదెలు, రామిల్ల మల్లేశ్, ఆగయ్య, చందర్, ప్రసాద్ పాల్గొన్నారు. నస్పూర్ అంబేద్కర్ భవన్ వద్ద దళిత నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కొప్పర్తి రాజం, కొయ్యల కొమురయ్య, మాడుగుల శంకర్, కొప్పర్తి సురేందర్, రాజు, మాడుగుల మహేశ్, కొయ్యల వెంకటేశ్వర్, రమేశ్, శంకర్, సాగర్, లింగయ్య, పోచయ్య పాల్గొన్నారు. మంచిర్యాలలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్ ఆధ్వర్యంలో సంబురాలు చేశారు. వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, తుల అంజనేయులు, జోగుల శ్రీదేవి, ముదాం మల్లేశ్, మల్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు. రామకృష్ణాపూర్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్, 11వ వార్డు కౌన్సిలర్ గడ్డం సంపత్, పార్టీ ప్రధాక కార్యదర్శి మాసు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ముద్దసాని శ్రీనివాస్, వైద్య శ్రీనివాస్, సీనియర్ నాయకులు కుమ్మరి మల్లయ్య, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు సంతోశ్, రామ్ నాయక్, మోత్కూరి దేవేందర్, ఈదునూరి రంజిత్, కొండ రాజబాబు పాల్గొన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్రపట్టానికి పాలాభిషేకం చేశారు. నాయకులు కొత్తురి ఆంధ్రయ్య, జిల్లపెల్లి శంకర్, చిట్యాల శంకర్, ప్రేమ్‌సాగర్, ఆదివాసీ నాయకుడు కుస్రం నిలకంఠం ఉన్నారు. పెంచికల్‌పేట్ మండలం కొండపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నాయకులు పాపయ్య, సునీల్, ప్రవీణ్, అంజి, పెంటయ్య, రాహుల్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ విద్యాలయం

## 'నవోదయ' పిలుస్తోంది

● ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
● మొదలైన స్వీకరణ ప్రక్రియ ● సెప్టెంబర్ 16 ఆఖరు తేది ● జనవరి 18న పరీక్ష

నస్పూర్, జూలై 27 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయం గ్రామీణప్రాంత విద్యార్థులకు వరంగా మారుతున్నది. 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలయింది. 80 సీట్లు భర్తీ చేయనుండగా, ప్రస్తుతం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నది. ఈ ప్రక్రియ సెప్టెంబర్ 16తో ముగియనున్నది. వచ్చే జనవరి 18న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అభ్యర్థులు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి. రూరల్ విద్యార్థులకు 75 శాతం రిజర్వేషన్ ఉంది. 1/3 శాతం సీట్లు బాలికలకు కేటాయిస్తారు.

## ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం

● రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం ● ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 2 : ట్రాఫిక్ నియమాలు పాటిద్దామని, ప్రమాదాల నివారణలో భాగస్వాములవుదామని ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలోని ఆసిఫాబాద్, కెరమెరి, వాంకిడి, రెబ్బెన మండలాల్లోని వాహనదారులు, ఆటో డ్రైవర్లు, ఓనర్లు, కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ నియంత్రణకు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో ప్రత్యేకంగా రెండు టీమ్‌లను ఏర్పాటు చేశామని. జిల్లాలో 45 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించామని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, తగు జాగ్రత్తలు తీసుకుంటామని అక్కడున్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు , జిల్లా రవాణా శాఖ అధికారి రాంచందర్, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

ఆకట్టుకుంటున్న శివపల్లి జలపాతం

## సోయగాల శివపల్లి జలపాతం

*గూడెం సమీపంలోని శివపల్లి అటవీప్రాంతంలోగల సోయగాల జలపాతం ఆకట్టుకుంటున్నది. కొండ కిందకు వెళ్లే దారిలో సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది. 10 రోజులుగా కురుస్తున్న వానలకు నీటి ధారలు జారిపడుతూ కనువిందు చేస్తున్నది. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి ప్రకృతి అందాలను తిలకిస్తూ ఆనందంగా గడుపుతున్నారు.*

*- చింతలమానేపల్లి, ఆగస్టు 2*

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679